జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
గురువారం | 15 | మే. 2025 | పేజీలు 5

# అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల**



**రఘునాథపాలెం, ప్రజా జ్యోతి :** అభివృద్ధి పనులు పది కాలాలపాటు ఉండేలా నాణ్యతతో చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.బుధవారం మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామం ఎస్.సి. కాలనీలో సి.ఆర్.ఆర్. (ఎస్.సి.పి.) నిధులు 40 లక్షల అంచనా విలువతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్ ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రఘునాథపాలెం మండలంలో అభివృద్ధి పనులను క్రమపద్ధతిలో చేపట్టామని తెలిపారు. సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులను వర్షాకాలం లోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని, ప్రస్తుతం చేసే పనులు పది కాలాలపాటు ఉండేలా నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు.మన పరిసరాలను మనం శుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్యం పాటిస్తేనే మన ఆరోగ్యం బాగా ఉంటుందని అన్నారు. రైతులు పంట మార్పిడి విధానం అమలు చేయాలని, ఆయిల్ పామ్ వంటి లాభ సాటి పంటలు సాగు చేయాలని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపట్టిందని మంత్రి తెలిపారు. రఘునాథ పాలెం మండలంలో వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని, ఆదర్శ మండలంగా దీనిని అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు పకడ్బందీగా చేపట్టామని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ ఎర్రగర్ల హనుమంతరావు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు



**ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం**

**వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్**

2లో

# ప్రభుత్వ అందించే ఉపాధి అవకాశాలతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**వ్యాపార విస్తరణ, లాభార్జనపై మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం**

**స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారవేత్తలుగా ఆలోచించాలి**

**పాల ఉత్పత్తిని పెంచి, డైరీ లాభదాయకంగా నడిపేందుకు కృషి చేయాలి**

**ఎర్రుపాలెంలోని మహిళా శక్తి స్త్రీ టీ సెంటర్ ను సందర్శించి చాయ్ సేవించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** స్థానిక లాభంతో కూడిన వ్యాపారం సృష్టించుకొని మరొకరికి ఉపాధి కల్పించే విధంగా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారవేత్తలుగా ఆలోచన చేసి, యూనిట్లను లాభదాయకం చేయడానికి చర్చించుకోవాలని జిల్లా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.బుధవారం ఎర్రుపాలెం -మిగతా 2లో




# ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు



**డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క**

**22 కోట్లతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం**

**రాష్ట్ర ప్రజలకు వైద్య భరోసా అందించేలా ఆరోగ్యశ్రీ పథకం అమలు**

**9 వేల కోట్ల రూపాయలతో రాజీవ్ యువ వికాసం పథకం అమలు**

**22 వేల 500 కోట్ల రూపాయలతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు**

**11 వేల 600 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం**

**మధిర నియోజకవర్గంలో పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సి.ఎం**

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** స్థానిక ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు మధిర నియోజక వర్గంలో పర్యటించారు.ముందుగా ఎర్రుపాలెం మండల కేంద్రంలో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులకు

## హేమంత్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మట్టా



**సత్తుపల్లి, మే 14 (ప్రజా జ్యోతి) :** మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామంలో గల పరిమి శ్రీనివాసరావు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వారి తనయుడు హేమంత్ ఇటీవల కర్ణాటకలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం ఆయన దిశ దిన కర్మ కావడంతో సత్తుపల్లి శాసనసభ్యులు వారి స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు సంతాపం సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని ఓదార్పునిచ్చారు. ఆమె వెంట గాదె చెన్నారావు, మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, కంచర్ల రమేష్,పువ్వాళ్ళ ఉమా, పొదిలి మారేశ్వరరావు తమ్మిశెట్టి గణేష్ కమల్ పాషా, పరిమి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ పార్టీ సమావేశాన్ని జయప్రదం చేయండి

### వైరా నియోజకవర్గ ఇన్చార్జి ఎర్రబాబు



**కారేపల్లి,మే 14, ప్రజా జ్యోతి :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వైరా నియోజకవర్గ సమావేశం ఈనెల 16వ తేదీ శుక్రవారంన కారేపల్లి క్రాస్ రోడ్ లో నిర్వహించబడునని వైరా నియోజకవర్గ ఇన్చార్జి ఎర్రబాబు బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు కామ్రేడ్ భాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ మండల నాయకులు,గ్రామ శాఖ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

## సృజనాత్మకతను వెలికితీయాలి

### వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి

### ఖమ్మం డీఈవో సామినేని సత్యనారాయణ

**కూసుమంచి, మే 14 (ప్రజా జ్యోతి) :** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రోత్సహించాలని ఖమ్మం డీఈవో సామినేని సత్యనారాయణ అన్నారు. బుధవారం కూసుమంచి ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రధానోపాధ్యాయులు,ఎంఈవో రాయల వీరస్వామితో కలిసి పరిశీలించారు. విద్యార్థులు గీసిన చిత్రాలను చూసి అభినందించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. వేసవిలో పిల్లలు సెల్ ఫోన్లకు దూరంగా ఉండి వివిధ అంశాలలో మెళకువలు నేర్చుకోవాలన్నారు. చదరంగం, క్యారమ్స్ లాంటి ఇండోర్ గేమ్స్, యోగా, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథ్స్ బేసిక్స్, పిల్లల ఆసక్తికి అనుగుణంగా కుట్లు, అల్లికలు, బ్యూటీషియన్, సాంస్కృతిక కార్యకలాపాల్లో తర్ఫీదు, సామాజిక సేవ తదితర అంశాల్లో శిక్షణనిస్తారన్నారు. శిక్షణకు వచ్చే విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు జుబేదా, సీఆర్పీలు వడ్లమూడి వెంకటేశ్వర్లు, షేక్ జాఫర్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

### ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం

### వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్



**కారేపల్లి, మే 14, ప్రజా జ్యోతి :** నియోజకవర్గ అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా పని చేస్తానని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. బుధవారం సింగరేణి మండలం కొత్త తండా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై పరిశీలనతోపాటు కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 63 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త తండాకు చెందిన ధారావత్ వినోద్ నాయక్ అభ్యర్థన మేరకు పైలట్ ప్రాజెక్టుగా కొత్త తండా గ్రామాన్ని ఎంపిక చేసామన్నారు. దీని కనుగుణంగా అర్హులైన 13 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయడంతో పాటు రైతు భరోసా ఇతర పథకాలను పూర్తిగా అమలు చేస్తున్నామన్నారు. గ్రామంలో ఏడుగురు లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం చేపట్టగా మిగతా ఆరుగురు లబ్ధిదారులు ప్రారంభించలేదన్నారు. ఆ కుటుంబాలకు డ్వాక్రా గ్రూపు ద్వారా ఆర్థిక సహాయం అందేలా ఏపీఎం చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్టు తెలిపారు. సింగరేణి మండలానికి 700కు పైగా వివిధ గ్రామ పంచాయతీల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం చేపడతారన్నారు. దశలవారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల మంజూరు చేస్తారని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో అరవై వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయలకు పైగా రుణమాఫీ వర్తించినట్లు తెలిపారు. మాదారం గ్రామపంచాయతీలో 937 మంది రైతులకు కోటి 30 లక్షల 29 వేల రూపాయలు రుణమాఫీ చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో 15 వేల రూపాయలు ప్రతి రైతుకు అదనంగా ఆదాయం సమకూరిందన్నారు. ప్రతిరేషన్ కార్డుదారుకు ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేయడంతో ప్రతి ఒక్కరూ బియ్యాన్ని వినియోగిస్తున్నట్టు తెలిపారు. మహిళలకు ఉచిత బస్ సర్వీస్ ద్వారా ప్రతినెల ప్రభుత్వం 300 కోట్ల రూపాయలు చెల్లిస్తుందన్నారు. అదేవిధంగా ఉచిత విద్యుత్తు ప్రభుత్వం అందించడంతో 350 కోట్ల రూపాయలు నెలవారి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రాజీవ్ యువ వికాస్ ద్వారా నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. పోడు భూముల్లో సాగుదారులకు 5వేలకు పైగా బోర్ల నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి. సురేందర్, ఎంపీ ఓ, ఏం. రవీంద్ర ప్రసాద్, హౌసింగ్ డి ఈ సాయిరాం రెడ్డి, విద్యుత్ ఏఈ సుధాకర్ రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావు, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ నరేందర్ రావు, ఏపీ ఎం పి. వెంకటేశ్వర్లు, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అందించే ఉపాధి అవకాశాలతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి..)



మండలంలో కలెక్టర్ పర్యటించారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలోని ఎంపీడివో కార్యాలయం ఎదుట ఉన్న ఇందిర మహిళా శక్తి స్త్రీ టీ సెంటర్ ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. స్త్రీ టీ నిర్వాహకురాలు డి. సునీతను కలెక్టర్ పలుకరిస్తూ, చాయ్ సెంటర్ మంచిగా నడుస్తుందా, వ్యాపారం అనుకూలంగా ఉందా అని అప్యాయంగా అడిగారు. ఎంపిడివో, మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదురుగా టీ స్టాల్ ఉంది గదా గిరాకి వస్తుందా అని ఆరాతీసారు. అమ్మ టీ పెట్టమ్మ అంటూ కలెక్టర్ చాయ్ ని సేవించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా, వ్యాపార అభివృద్ధికి సౌకర్యాలు కల్పించే అవసరం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ తోడ్పాటుతో ప్రారంభించిన వ్యాపార యూనిట్లను మహిళలు చాకచక్యంగా నడిపిస్తూ లాభాలు అర్జించాలని తెలిపారు. మహిళా శక్తి పథకం కుటుంబానికి ఆర్థిక ప్రగతిని ఇస్తుందని, మహిళలు స్వయం శక్తితో ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. వ్యాపారాలకు అవసరమైన సామాగ్రిని నాణ్యతతో ఉన్న దగ్గర నుంచి కొనుగోలు చేయాలని, ప్రస్తుత మార్కెట్ ట్రెండ్స్ అనుగుణంగా వ్యాపారం కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ఇందిరా మహిళా శక్తి పథకం మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం సమృద్ధికి దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. మహిళలకు లబ్ధి చేకూరాలనేది ప్రభుత్వం లక్ష్యమని, ఇందుకోసం స్త్రీ నిధి ఏర్పాటు, బ్యాంకులతో అనుసంధానం సహా వివిధ మార్గాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామని తెలిపారు. ఇందిర మహిళా శక్తి పథకం ద్వారా అతివలకు ఆసక్తి ఉన్న రంగాల్లో వృత్తి, నైపుణ్య శిక్షణ ఇప్పించడంతో పాటు బ్రాండింగ్, మార్కెటింగ్‌లలో మెలకువలు నేర్పించేందుకు సౌకర్యాలను కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అనంతరం మహిళా సమైక్య సభ్యులతో ఇందిరా మహిళా డెయిరీ స్థాపన, పాడి పశువుల యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక, పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్ తదితర స్వయం ఉపాధి అవకాశాల పై చర్చించారు. ఇందిరా మహిళా డెయిరీ ద్వారా మహిళలకే పాడి పశువులు అందించి, పాల సేకరణ నుంచి ప్యాకింగ్, బై ప్రోడక్ట్ (వెన్న, మజ్జిగ, పెరుగు, నెయ్యి, స్వీట్స్) ఉత్పత్తి, మార్కెటింగ్ చేసి లాభాలు పొంది మహిళలు పంచుకోనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా శక్తి యూనిట్ ల గ్రౌండింగ్ తో పాటు అవి విజయవంతంగా నడిచేందుకు అవసరమైన సహాయ, సహకారాలు, చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని, దీని కోసం మహిళలకు వ్యాపార దృక్పథం, అధికంగా లాభాలు ఎక్కడి నుంచి రాబట్టాలనే ఆలోచన సరళి రావాలని, తక్కువ రిస్క్ తోపహ్యాపారాలు ఎలా చేయాలి వంటి అంశాలు మహిళలకు నేర్పించాలని తెలిపారు. పాడి పశువుల కొనుగోలు ప్రక్రియ జూలై నెలలో ప్రారంభించాలని, ప్రతి నెలా ఎన్ని పాడి పశువులు కొనుగోలు చేయాలో ప్రణాళిక తయారు చేసుకోని సుమారు 5 వేల యూనిట్ల పాడి పశువులను గ్రౌండ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇప్పుడు రెండు పాడి పశువులు ఉన్న లబ్ధిదారులకు మరో రెండు పశువులు అందించేందుకు ఎంపిక చేసే పక్షంలో వారికి షెడ్డు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించాలని, ప్రతి పాడి పశువుకు బీమా కల్పించేలా ప్రణాళిక తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనపు డిఆర్డీవో నూరొద్దిన్, ఎంపీడివో బి. సురేందర్ నాయక్, గ్రామ, మండల సమాఖ్య సభ్యులు, అధికారులు, తదితరులు ఉన్నారు.

# సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

**కారేపల్లి, మే 14, ప్రజా జ్యోతి :** కార్మిక - కర్షక మైత్రితో కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికై మే 20న జరిగే సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని కార్మిక,రైతు,కూలీ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం కారేపల్లి లోని భాగం రామ నరసయ్య భవనంలో రైతు కూలి సంఘం నాయకులు వై. ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ఈనెల 20వ తారీఖున దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మె , గ్రామీణ బంద్ కార్యక్రమం నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్నదని ఈ ఈ కార్యక్రమాన్ని కర్షకులు కార్మికులు మేధావులు విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమ్మెలో మోడీ ప్రభుత్వం అస్త్రంగా భావిస్తున్న కుల,మత,ప్రాంత విభజన రాజకీయాలని అడ్డుకోవాలని,మోడీ ప్రభుత్వ కార్మిక హక్కుల హననం, పని గంటల పెంపును, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కును హరించడం, కనీస వేతనం అమలు జరపకపోవడం వంటి కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటం నిర్వహించాలని, ఈ సమ్మె, గ్రామీణ బంద్ లో కార్మికులు,రైతులు,వ్యవసాయ కూలీలు ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో %జుఖ% మండల కన్వీనర్ కే. నరేంద్ర,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన




నాగేశ్వరరావు, ఐఎన్టీయూసీ నాయకులు టీ. చంద్ర ప్రకాష్, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జ రామారావు, వ్యకాస మండల అధ్యక్షులు వై. రవి, ఏఐటీయూసీ నాయకులు బోళ్ళ రామస్వామి, టి యు సి ఐ నాయకులు సక్రు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి ఎస్. నాగమణి, ఆశా వర్కర్ సీనియర్ జిల్లా నాయకురాలు ఎల్లబోయిన రాధ,బిల్డింగ్ వర్కర్ సీనియర్ మండల అధ్యక్షులు కేలోత్ రవి,గ్రామపంచాయతీ యూనియన్ మండల కార్యదర్శి ఎస్కె హుస్సేన్, రైతు కూలి సంఘం నాయకులు సత్తిరెడ్డి,%గూ×ఖూ% నాయకులు తలారి దేవ ప్రకాష్, మహిళా సంఘం మండల కార్యదర్శి కే. ఉమావతి, బోళ్ల కొమరయ్య, పాలిక తిరపయ్య, పూనేం. వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక స్వాతంత్ర్యంతో మహిళలకు సొంత అస్తిత్వం సాధ్యం

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

### అర్హులకు యువ వికాసం క్రింద స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు

### ప్రతి మండల కేంద్రంలో దివ్యాంగ మహిళలచే జిరాక్స్ సెంటర్ల ఏర్పాటు

### ఖమ్మం రూరల్ మండలం తరుణిహట్ లో నిర్వహిస్తున్న ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి, (ప్రజా జ్యోతి) :** స్థానిక ఆర్థిక స్వాతంత్ర్యంతో మహిళలకు సొంత అస్తిత్వం సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.పాన్ ఇండియా స్థాయిలో 10 జిల్లాలలో అమలు అవుతున్న డిజిటల్ ఇండియా కామన్ సర్వీస్ సెంటర్ ప్రాజెక్టు ను సుగమ్య భారత్ మార్గదర్శకాల్లో భాగంగా ఖమ్మం ను పైలట్ జిల్లా గా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా బుధవారం తరుణిహట్ లో నిర్వహిస్తున్న ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. వ్యాపార నైపుణ్య శిక్షణ పొందిన వారితో కలెక్టర్ సమావేశమయ్యారు. వివిధ రకాల వ్యాపార శిక్షణలో నేర్చుకొన్న విషయాలను కలెక్టర్ కు వివరించారు. ఎస్.జి.హెచ్. మహిళలు, మోడల్ సిజిఎస్ కేంద్రాలు ఏర్పాటు చేసుకునేందుకు రాజీవ్ యువ వికాసం క్రింద గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యత కల్పించి యూనిట్లు మంజూరు చేయాలని వారు కలెక్టర్ ను కోరారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ నేటికీ మన సమాజంలో పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు అందడం లేదని, అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్నప్పటికీ కొంత వివక్ష ఉందని వీటిని నిర్మూలించేందుకు మనమంతా కృషి చేయాలని అన్నారు. మానవ సంబంధాలతో పాటు మహిళలకు సొంత అస్తిత్వం ఉండటం చాలా కీలకమని అన్నారు.మన బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉంటేనే మనకు సొంతంగా అస్తిత్వం ఉంటుందని, మహిళలు ఆర్థికంగా ఇతరులపై ఆధారపడకుండా ఉండేందుకు స్వయం ఉపాధి యూనిట్ స్థాపనకు ఇందిరా మహిళా శక్తి, వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల క్రింద ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. మారుతున్న ప్రపంచం అనుగుణంగా మనమూ మారాలని, ఉద్యోగాల కోసం వేచి చూడకుండా మనమే 10 మందికి ఉపాధి కల్పించేలా ఔత్సాహిక వేత్తలుగా ఎదగాలని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలకు అర్హులైన వారు మండల స్థాయిలోనే దరఖాస్తు చేసుకునేలా ఖమ్మం జిల్లాలో వ్యవస్థ ఏర్పాటు చేశామని, మండల స్థాయిలో తహసిల్దార్ ప్రజావాణి జరుగుతుందని అన్నారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలు అందించే దిశగా ఆలోచన చేయాలని కలెక్టర్ తెలిపారు. సమాజంలో ప్రజలకు ఉన్న సమస్యలను పరిశీలించి వాటిని తొలగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలను రూపొందిస్తాయని, అర్హులైన వారు వాటిని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.మనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే అవకాశాలను వినియోగించుకుంటూ గొప్ప స్థాయికి ఎదగాలని, ఎదిగిన తర్వాత మన చుట్టూ ఉన్న 10 మంది ఎదిగేందుకు మన వంతు సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు. మనలో ఉన్న సామర్థ్యాన్ని నమ్ముకోవాలని, ఎన్ని కష్టాలు వచ్చినా వాటిని దాటుకొని ఎలా నిలబడాలో ఆలోచించాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న రాజీవ్ వికాసం పథకం క్రింద అందరికీ సహకారం అందించడం జరుగుతుందని అన్నారు. సిటిజన్ సర్వీస్ సెంటర్, జిరాక్స్ షాపులను షీ రాక్స్ పేరిట ప్రతి తహసిల్దార్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.ముందుగా దివ్యాంగ మహిళలచే జిరాక్స్ కేంద్రాలు ప్రారంభిస్తామని, అనంతరం దశల వారీగా కామన్ సర్వీస్ సెంటర్ వద్ద శిక్షణ తీసుకున్న మహిళలకు కూడా కేటాయిస్తామని అన్నారు. అధికారులపై నమ్మకంతో ప్రజలు కార్యాలయాలకు వచ్చేలా సానుకూల దృక్పథ్యంతో జిల్లా యంత్రాంగం పని చేస్తుందని అన్నారు.అనంతరం తరుణీహట్ ఆవరణలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ఆదనపు డిఆర్డీవో నూరోద్దీన్, ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం డైరెక్టర్ సి. చంద్రశేఖర్, బేతోజు హరికృష్ణ కుమార్, ఫయాజ్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.




### బోనకల్,చింతకాని మండలాలో పలు శుభకార్యాలకు హాజరైన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు



**ఖమ్మం ప్రతినిధి, ప్రజా జ్యోతి :** స్థానిక బొనకాల్ మండలం బ్రామ్మనపల్లి గ్రామం లో జరుగుతున్న గుడిద కృష్ణ కుమారు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించినారు. అనంతరం నరసింహపురం గ్రామం లో జరుగుతున్న పట్టేటి గోపయ్య కుమారుని వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కమల్‌రాజు వెంట బోనకల్,చింతకాని మండలాల బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరైనారు.

## పాలేరు నియోజకవర్గ బి.ఎస్.పి అధ్యక్షులుగా ఏన్నబోయిన రమేష్ యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక

**తిరుమలాయపాలెం, మే 14, ప్రజా జ్యోతి :** బహుజన్ సమాజ్ పార్టీ పాలేరు నియోజకవర్గ సమావేశం బుధవారం తిరుమలాయపాలెం మండల కేంద్రం నందు జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు చెరుకుపల్లి నాగేశ్వరరావు, జిల్లా ఇన్చార్జి అయితగాని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి చెరుకుపల్లి నాగేశ్వరావు మాట్లాడుతూ, పాలేరు అసెంబ్లీలో మెజార్టీ ప్రజలైన, బీసీ , ఎస్సీ , ఎస్టి , మైనారిటీ ప్రజలు ఏకమై పాలేరు అసెంబ్లీని కైవసం చేసుకోవాలని, అన్నారు, తద్వారా మన సమస్యలు మనమే పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుంది అని అన్నారు. ఈ సమావేశానంతరం పాలేరు నియోజకవర్గ అధ్యక్షులుగా శ్రీ, ఎన్నబోయిన రమేష్ యాదవ్ ను సమావేశంలోనే సభ్యులందరూ. బహుజన సమాజ్ పార్టీ పాలేరు నియోజకవర్గ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా అధ్యక్షులైన ఎన్నబోయిన రమేష్ యాదవ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో అధ్యక్ష పదవి అప్పజెప్పిన జిల్లా కమిటీకి, ప్రత్యేక జై భీమ్ లు తెలుపుకుంటూ ఈ దేశంలో, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ల పై జరుగుతున్న అన్యాయాలపై, బహుజన్ సమాజ్ పార్టీ మాత్రమే పోరాడుతుందని, అలాగే బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం లో పొందుపరిచిన సామాజిక అంశాలు, సమానత్వ%శీ%, సోదర భావం, విద్య, ఉద్యోగం, రాజకీయ రంగాలలో సమానమైన న్యాయం బి.ఎస్.పి తోనే సాధ్యమని, దానికి ఉదాహరణనే గత ఎన్నికల్లో ఎవరి జనాభా ఎంతో వారికన్ని ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఇచ్చి, ఎన్నికల్లో పోటీ చేపించింది బి.ఎస్.పి పార్టీ. రాబోయే స్థానిక సంస్థల్లో కూడా, అదే నినాదంతో ఎవరి జనాభా కనుగుణంగా వారికి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, అభ్యర్థులను ఎన్నికల్లో పోటీగా నిలబెడతామని, ఈ దేశంలో బాధిత ప్రజలమైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ప్రజలందరూ కూడ బహుజన్ సమాజ్ పార్టీని ఆదరించాలని తెలిపినారు. ఈ యొక్క సమావేశ%శీ% లో జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల నాగరాజ్, పాలేరు సెంబ్లీ ఇన్చార్జ్ బుర్ర ఉపేందర్, పాలేరు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కొమ్ము పూలే, నియోజకవర్గ నాయకులు పోలే పొంగు మాల్సూర్ , నల్లగట్టు శంకర్, మట్టే నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు

(మొదటి పేజీ తరువాయి..)

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ప్రజల ఆకాంక్ష మేరకు ఎర్రుపాలెం మండల హెడ్ క్వార్టర్ లో 22 కోట్ల రూపాయలతో 50 పడకల ఆసుపత్రిని ప్రజా ప్రభుత్వం మంజూరు చేసి నేడు శంకుస్థాపన చేసుకుంటున్నామని అన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి వేగవంతంగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. గత సంవత్సర కాలంలో వైద్యశాఖ ద్వారా ప్రజా ప్రభుత్వం 11 వేల 600 కోట్ల రూపాయలను ఖర్చు పెట్టిందని అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన దాదాపు 90 లక్షల కుటుంబాలకు వైద్యం కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి రావద్దని ఆరోగ్య శ్రీ పథకం క్రింద కార్పొరేట్ ఆసుపత్రులలో 10 లక్షల వరకు వైద్యం చేయించుకునేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని అన్నారు. పేదలకు 100 రోజుల ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, పేదల పిల్లల చదువు కునేందుకు వీలుగా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్వహిస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నూతనంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు 11 వేల 600 కోట్లతో ప్రారంభించామని అన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న 90 లక్షలకు పైగా కుటుంబాలకు ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ వంటి పెద్ద పెద్ద కోర్సులు చదివేందుకు ఫీజు రీయంబర్స్మెంట్ పథకం అమలు చేస్తున్నామని, రేషన్ ద్వారా ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, అర్హులకు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ సరఫరా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వ పరిధిలో ఉన్న ఖాళీలను పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా పరీక్షలు నిర్వహించి భర్తీ చేస్తున్నామని, ప్రైవేట్ రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించి ఉద్యోగ అవకాశాలను సృష్టించామని, స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన క్రింద యువతను ప్రోత్సహించేందుకు 9 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకం జూన్





రెండున రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు ప్రారంభిస్తున్నా మని అన్నారు. పేదలు చాలా రోజులుగా ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రజా ప్రభుత్వం రాగానే ప్రారంభించిందని, 22 వేల 500 కోట్ల రూపాయలతో ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు చొప్పున మంజూరు చేసి ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తామని, రాబోయే ఐదు సంవత్సరాలలో ఇండ్లు లేని అందరికీ ఇండ్లు వచ్చేలా చూస్తామని అన్నారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్. పట్టాలు ఉన్న గిరిజన, ఆదివాసి రైతులకు ఇందిర సౌర గిరి జల వికాస పథకం క్రింద 12 వేల 500 కోట్ల రూపాయలతో సోలార్ పంపు, మోటార్ డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైతుల కోసం రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ వంటి పథకాలు అమలు చేశామని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన లబ్ది వివరాలను తయారుచేసి వివరాలు వెల్లడిస్తామని అన్నారు. విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించిందని అన్నారు. గత పాలకులు సృష్టించిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కష్టపడి బయట పడేస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేస్తున్నామని అన్నారు. మహిళలకు గతంలో పావలా వడ్డీ రుణాలు ఇచ్చామని, గత పాలకులు వీటిని విస్మరిస్తే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి సంవత్సరం 21 వేల కోట్ల రూపాయలను మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించామని అన్నారు. మహిళా సంఘాలకు మొత్తం లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందించేలా ప్రణాళిక తయారు చేశామని అన్నారు. మహిళా సంఘాల ద్వారా వెయ్యి మెగా వాట్ల సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, ఆర్టిసి అద్దె బస్సులు, పెట్రోల్ పంపు, రైస్ మిల్ ఏర్పాటు వంటి వాణిజ్య యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఖమ్మం జిల్లాకు 3 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటి నిర్మాణ పనులకు టెండర్లు పూర్తి చేశామని, మరో 6 నుంచి 8 నెలల కాలంలో వాటి నిర్మాణం పూర్తి చేసి అంతర్జాతీయ స్థాయిలో మన విద్యార్థులకు విద్యాబోధన అందిస్తామని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2 లక్షల మెట్రిక్ టన్నుల కంటే అధికంగా వరి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర క్రింద 200 కోట్లకు పైగా, బోనస్ ద్వారా 30 కోట్లకు పైగా రూపాయలను రైతులకు చెల్లింపులు చేశామని అన్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం ద్వారా రైతులకు అధిక లాభాలు అందించేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఎర్రుపాలెం మండలంలో 50 పడకల ఆసుపత్రిని నిర్మించడం ద్వారా ఇక్కడి ప్రజలకు అనారోగ్యం సమయాలలో ప్రైవేటు వైద్యశాలలకు పోవాల్సిన అవసరం ఉండదని అన్నారు. జిల్లా పెద్ద ఆసుపత్రి అభివృద్ధికి 30 కోట్ల రూపాయల నిధులను డిప్యూటీ సీఎం కేటాయించారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి లోనే నాణ్యమైన వైద్యం అందించడం ద్వారా ప్రజల ఆదాయం కాపాడటంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా 34 మంది కళ్యాణలక్ష్మి పథక లబ్ధిదారులకు రూ. 34,03,944 విలువ గల చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం ఎర్రుపాలెం మండలం కండ్రిక గ్రామంలో 2 కోట్ల 62 లక్షలతో కండ్రిక నుండి పెద్ద గోపవరం వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, బనిగండ్లపాడు గ్రామంలో బనిగండ్ల పాడు నుండి బంజర రోడ్డు వరకు 5 కోట్ల 74 లక్షలతో నిర్మించ నున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, బోనకల్ మండ లం కలకోట గ్రామంలో కలకోట నుండి మోటమర్రి వరకు 20 కోట్ల రూపాయలతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు, 10 లక్షల రూపాయలతో నిర్మిం చనున్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు, 12 లక్షల రూపాయలతో నిర్మించనున్న మత్స్య సంఘ భవన నిర్మాణ పనులకు, రావినూతల గ్రామంలో 280 లక్షల రూపాయలతో రావినూతల నుండి ఆళ్లపాడు వరకు రోడ్డు నిర్మాణ పనులకు, 800 లక్షల రూపాయలతో రావి నూతల నుండి గోవిందా పురం వరకు బిటి రోడ్ రెనివల్ పనులకు డిప్యూటీ సి.ఎం. శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాం దాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాసా చారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. కళావతి బాయి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, ఏడిఏ విజయ్ చందర్, తహశీల్దార్లు ఉషా శారద, పున్నంచందర్, ఎంపిడివో లు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్ల ఇంటికి వరం, ఆడపిల్ల పుడితే పండుగ చేసుకోవాలి

**స్పెషల్ ఆఫీసర్ ధనసరి పుల్లయ్య**

**తిరుమలాయపాలెం, మే 14, ప్రజా జ్యోతి :** ఆడపిల్ల ఇంటికి వరం, ఆడపిల్ల పుడితే ఇంటిల్లిపాదీ పండుగ చేసుకోవాలని, అదృష్టం ఉన్నవాళ్లకు మాత్రమే ఆడపిల్లలు పుడతారని తిరుమలాయపాలెం మండల స్పెషల్ ఆఫీసర్ ధనసరి పుల్లయ్య అన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆడపిల్ల జన్మోత్సవ వేడుకలను కన్నుల పండుగగా, ఘనంగా నిర్వహించారు. బచ్చోడు గ్రామానికి చెందిన తాటికొండ భానుశ్రీ, ఇటీవల ఆడపిల్లకు జన్మనివ్వగా... మండల స్పెషల్ ఆఫీసర్ పుల్లయ్య ఆమె ఇంటికి వెళ్లి మిఠాయి బాక్స్, పండ్లు, ధ్రువపత్రం, చిన్నారికి నూతన దుస్తులు అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో తల్లితోపాటు భర్త అశోక చారి నీ, వారి అత్త, మామలను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ పుల్లయ్య మాట్లాడుతూ.. ఆడపిల్లలు జన్మిస్తే తల్లిదండ్రులు భారంగా కాకుండా, వరంలా భావించాలని అన్నారు. కార్యక్రమంలో తిరుమలాయ పాలెం ఎంపీడీవో ఎస్.కె సిలార్ సాహెబ్, ఏవో నా రెడ్డి సీతారామరెడ్డి, సీడీపీఓ ఉదయశ్రీ, సూపర్వైజర్ లక్ష్మి , ఏఈఓ రమేష్, అంగన్వాడీ టీచరు లు లింగమ్మ, సుజాత, సత్యమ్మ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

**38 పరీక్షా కేంద్రాలు.. 15,461 మంది విద్యార్థులు**

**జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు**

**నేలకొండపల్లి, మే 14 ప్రజా జ్యోతి :** జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఆకస్మికంగా సందర్శించారు. ఇంటర్ పరీక్షల పై అధ్యాపకులతో చర్చించారు. నూతనంగా విద్యార్థుల ప్రవేశాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...జిల్లా లో ఈ నెల 22 నుంచి ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 38 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారిలో 11,780 మంది ఇంటర్ మొదటి సంవత్సరం, 3,681 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 15,461 మంది పరీక్షలు వ్రాయనున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహణ కు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది 77.09 శాతం ప్రభుత్వ కాలేజీలలో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది నూరు శాతం ఫలితాల సాధన కు కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కాలేజీలలో ఫెయిలైన విద్యార్థుల కోసం పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఆఫ్ లైన్ లేదా ఆన్లైన్ లో కూడ తరగతులు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ కాలేజీలలో చేరేందుకు వసతి గృహాలతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించేందుకు అధ్యాపకులు డోర్ టూ డోర్ ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ కాలేజీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులపై సమీక్ష

**ఖమ్మం ప్రతినిధి, ప్రజా జ్యోతి :** స్థానిక ఖమ్మం నగర పాలక సంస్థ పరిపాలన వ్యవస్థ పౌర అవసరాలను దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో, నగరంలోని వివిధ వార్డుల్లో నిర్మాణంలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ (%ఖ+ణ%) వ్యవస్థ పనులను అధికారులు తో కలిసి మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. పరిశీలనలో భాగంగా నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, పాల్గొన్నారు. అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా వర్షాకాలం ప్రారంభమవుతున్న దృష్ట్యా పనులను వేగవంతం చేయాలని సూచించారు. నగర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, నాణ్యమైన నిర్మాణ ప్రమాణాలను పాటిస్తూ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో నీటి నిల్వ, కాలువలలో జమయ్యే చెత్త వంటి సమస్యల నివారణకు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ కీలకమైందని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత, వేగం, నాణ్యత పరిరక్షణే లక్ష్యంగా ఉండాలని అధికారులకు తెలియజేశారు. అవసరమైతే మానిటరింగ్ మెకానిజాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

